హుస్నాబాద్‌లో పండుగపూట విషాదం
- కారు బోల్తా.. బాలుడి మృతి
- మరో ముగ్గురికి గాయాలు
7 లో..

పండుగ సందడి

- ముగ్గులతో ఆకట్టుకున్న ముంగిళ్లు
- పల్లెలు.. పట్టణాలకు కాంతులు
- చిన్నాపెద్ద పతంగుల ఎగురవేత
- పిండివంటల ఘుమఘుమలు
- నేడు సంక్రాంతి, రేపు కనుమ





వాకిట్లో రంగు రంగుల ముగ్గులు.. చక్కని గొబ్బెమ్మలు.. భగభగ భోగి మంటలు.. హరిదాసుల కీర్తనలు.. డూడూ బసవన్నల ఆటలు.. నింగిని తాకే గాలిపటాలు.. నోరూరించే పిండి వంటలు.. ఉత్సవంలా జరుపుకునే సంక్రాంతి రానే వచ్చింది.. ఇంటింటా సంబురాలు తీసుకొచ్చింది. నేడు సంక్రాంతి, రేపు కనుమను కనులపండువగా జరుపుకునేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. బంధుమిత్రులతో గ్రామాల్లో సందడి మొదలైంది.

వైభవంగా భోగి

పల్లె లోగిళ్లలో పండుగ కాంతులు వెల్లివిరుస్తున్నాయి. ఊరూవాడ రంగవల్లులు మురిపించాయి. వీధివీధిన సింగిడి అందాలు పరుచుకున్నాయి. వాకిళ్లు ముగ్గుల లోగిళ్లుగా మారాయి. భోగ భాగ్యాలనిచ్చే భోగి పండుగ వేడుకలను ఆదివారం ఉమ్మడి జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే మహిళలు, యువతులు వాకిళ్లలో కల్లాపి చల్లి వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ముగ్గుల మధ్యలో గొబ్బెమ్మలను పెట్టి పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించారు. రేగు పండ్లు, నవధాన్యాలను పెట్టారు. పల్లె, పట్టణం ఏ వీధి చూసిన ముగ్గులు, గొబ్బెమ్మలతో పండుగ శోభను సంతరించుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భోగి మంటలు వేశారు. పలు చోట్ల చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. పిల్లలు, పెద్దలు పతంగులు ఎగురవేస్తూ బిజీగా కనిపించారు. పతంగుల దుకాణాలు రద్దీ మారాయి. కొన్ని చోట్ల చిన్నారులు బొమ్మరిల్లు కట్టుకొని మట్టి పాత్రల్లో వంట వండుకొని తిన్నారు. గంగిరెద్దుల విన్యాసాలతో గ్రామాల్లో సందడి నెలకొన్నది. నేడు సంక్రాంతి, రేపు కనుమ పండుగను చేసుకోనున్నారు. పండుగ సందర్భంగా జిల్లాల్లోని వివిధ దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. గాలిపటాలు, రంగులు, చెరకు గడలు, రేగుపండ్ల దుకాణాలు వెలిశాయి. సంగారెడ్డి పట్టణంలో పాత బస్టాండ్ నుంచి మొదలుకొని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు రోడ్డుకిరువైపులా 60కిపైగా తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. చిన్నారులను ఆకర్షించేలా వివిధ డిజైన్లు, కార్టూన్ బొమ్మలు, హీరోల బొమ్మలతో ముద్రించిన పతంగులను విక్రయిస్తున్నారు. పతంగులు, మాంజా, పూల ధరలు రెట్టింపయ్యాయి.

- మెదక్ అర్బన్/ సంగారెడ్డి రూరల్/ సిద్దిపేట అర్బన్, జనవరి 14 :


సంగారెడ్డిలో డిజైన్ పతంగిని చూపుతున్న యువకుడు

చిన్నారులకు భోగి పళ్లు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భోగి రోజు తమ ఇళ్లల్లో చిన్నారులకు సంప్రదాయ బద్ధంగా భోగి పళ్లను పోశారు. ఐదు రకాల పళ్లను కలిపి చిన్నారుల తలపై నుంచి భోగి పండ్లను పోయడం ఆనవాయితీ. ఈ పళ్లు పోయడంతో పిల్లలు ఆయురారోగ్యాలతో ఉంటారని విశ్వాసం. అలాంటి సంప్రదాయాన్ని పలు కుటుంబాలు కొనసాగించాయి.


చిన్నకోడూరులో పిల్లలకు భోగి పండ్లు పోస్తున్న పెద్దలు


సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వద్ద భోగి మంటలు

మల్లన్న ఆలయంలో సంక్రాంతి రద్దీ

- సెలవులు కావడంతో భారీగా భక్తుల రాక

చేర్యాల, జనవరి 14 : కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. సంక్రాంతి పర్వదినం సందర్భంగా సెలవులు రావడంతో దూర ప్రాంతాలకు చెందిన వందలాదిమంది భక్తులు ఇంటిల్లిపాదిగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానమాచరించి సంప్రదాయబద్ధంగా బెల్లం పాయసం వండి బోనం నివేదించారు. చెలక, నజరు, ముఖమండప పట్నాలు రచించి స్వామివారికి బండారు, పట్టువస్త్రాలు సమర్పించి తమను కాపాడమని వేడుకున్నారు. కోరిన కోరికలు ఈడేర్చమని ప్రార్థిస్తూ గంగిరేగు చెట్టుకు ముడుపుకట్టారు. అలాగే మల్లన్న సహోదరి ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడిబియ్యం సమర్పించారు. తమ పాడి పంటలు చల్లగా కాపాడమని వేడుకున్నారు. స్వామివారి దర్శనం కోసం ఉచిత, ప్రత్యేక, శీఘ్రదర్శన క్యూలైన్లలో బారులు తీరారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు.


మల్లన్నకు పట్నంవేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

- మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్‌రావు





హుస్నాబాద్/సిద్దిపేట టౌన్, జనవరి 14 : మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సకల సంపదలతో సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబసభ్యులంతా కలిసి ఆనందంగా జరుపుకోవాలని, ఈ సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన కాంతి తీసుకరావాలని ఆకాంక్షించారు. ప్రజలందరు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని, పసిడి పంటలతో పరిఢవిల్లాలని కోరుకున్నారు.

సఫాయిలకు సలాం

- పారిశుధ్య కార్మికులు సామాజిక వైద్యులు
- అవార్డులొస్తే స్పందించని రాష్ట్ర ప్రభుత్వం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజం
- కార్మికులకు స్వీట్లు తినిపించి సన్మానం

సిద్దిపేట టౌన్, జనవరి 14 : ఉదయాన్నే లేచి చెత్త సేకరణ, రోడ్లను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజల ప్రాణాలు కాపాడుతున్న సఫాయిలందరికీ సలాం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దక్షిణ భారతదేశంలో సిద్దిపేటకు క్లీన్ సిటీ అవార్డు వచ్చిన నేపథ్యంలో మున్సిపల్ కార్మికులకు హరీశ్‌రావు స్వీట్లు తినిపించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంక్రాంతి పండుగను మున్సిపల్ కార్మికులతో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. క్లీనెస్ట్ సిటీ ఆఫ్ తెలంగాణ అండ్ సౌత్ ఇండియాగా సిద్దిపేట అవార్డు సాధించడం మనందరికీ గర్వకారణమన్నారు. రాష్ట్రంలో ఒకే ఒక్క మున్సిపాలిటీకి జాతీయస్థాయి అవార్డు ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీసం అభినందనలు తెలపని పరిస్థితి ఏర్పడిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎక్కడ అవార్డు వచ్చినా ప్రభుత్వమే పిలిచి అభినందించే సంస్కృతి ఉండేదన్నారు. 2022-2023లో దేశంలోని 4,416 మున్సిపాలిటీల్లో 9వ స్థానంలో హైదరాబాద్ నిలిస్తే, దక్షిణ భారత దేశంలో సిద్దిపేట మొదటిస్థానంలో నిలిచిందని తెలిపారు. అవార్డులొస్తే రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభినందన ట్వీట్, ప్రెస్‌నోట్‌కు కూడా నోచుకోలేని దుస్థితిలో ఉన్నామన్నారు. అవార్డు వస్తే ప్రభుత్వానికి ఇంత కుళ్లు ఎందకని ప్రశ్నించారు. ఈ అవార్డు సిద్దిపేట ప్రజలకు అంకితమని, ప్రజల భాగస్వామ్యం లేనిది, అనుకున్న లక్ష్యం నెరవేరడం సాధ్యం కాదని చెప్పారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషికి చేతులెత్తి మొక్కుతున్నానన్నారు. వైద్యులు రోగాలు వచ్చిన తర్వాత చికిత్సనందిస్తే, మీరు రోగాలు రాకుండా కాపాడుతున్న సామాజిక వైద్యులని కొనియాడారు. అభివృద్ధి చెందిన దేశాల్లో రోడ్లు శుభ్రంగా ఉంటాయని, అక్కడ పరిశుభ్రత బాగుంటుందని అంటారని, అది అధికారులు లేదా అక్కడి ప్రజాప్రతినిదుల ఘనత మాత్రమే కాదని ప్రజల గొప్పతనం ఉందన్నారు. అసలు చెత్తను అక్కడి ప్రజలు రోడ్ల మీద వేయరని, చాక్లెట్ కవరైనా జేబులో పెట్టుకొని వెళ్లి డస్ట్‌బిన్‌లో వేస్తారని చెప్పారు. సిద్దిపేట ప్రజలు అలా ఉన్నతంగా ఆలోచించే స్థాయికి వెళ్లినట్లు తెలిపారు. మార్పు రావడంతో తనకు కడుపు నిండిన సంతోషం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఒకప్పుడు సిద్దిపేట అంటే పందులు, చెత్త చెదారం, ఎక్కడ చూసిన దుర్గంధం, దుర్వాసనని, నేడు సిద్దిపేట అంటే స్వచ్ఛత, పరిశుభ్రత, పచ్చదనమని, దీంతో శుద్ధిపేటగా మారినట్లు చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో ఉత్తమ మున్సిపాలిటీలకు, అత్యుత్తమ పట్టణాలకు అవార్డులు ప్రకటిస్తున్నారంటే అందులో సిద్దిపేట పేరు ఉందనేలా అవార్డులు మనకు దక్కాయన్నారు. అవార్డు రావడంలో ప్రజల భాగస్వామ్యం ఒక వైపు, ప్రజాప్రతినిధుల చొరవ, కార్మికుల కష్టం మరో వైపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌మంజుల రాజనర్సు, వైస్ చైర్మన్ జంగిటి శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



అవార్డు, ప్రశంసాపత్రంతో హరీశ్‌రావు, మున్సిపల్ పాలకవర్గం, పారిశుధ్య కార్మికులు

మల్లన్న సన్నిధిలో దొంగల బెడద

- గంగరేగుచెట్టు ప్రాంగణంలో దోపిడీలు
- రద్దీ వేళ భక్తులకు శఠగోపం

చేర్యాల, జనవరి 14: కొమురవెల్లి మల్లన్న దర్శనం కోసం వచ్చిన భక్తులు దొంగల బెడదతో ఆందోళన చెందుతున్నారు. ఆగంతకుల మాయాజాలంలో చిక్కుకుని దోపిడీకి గురవుతున్నారు. ప్రతీ ఆది, బుధవారాల్లో వేలాదిగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు గుంపులో చేరి దోచుకుంటున్నారు. మహిళల మెడల్లో నుంచి బంగారు గొలుసులను కొట్టేస్తున్నారు. పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఆలయ వర్గాలు, పోలీసులు చెబుతున్నా చోరీలు ఆగడం లేదు. ఏడో తేదీన జరిగిన మల్లన్న కల్యాణోత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అదేరోజున తోటబావి ప్రాంగణంతో పాటు గంగరేగు చెట్టు ఆవరణలో పలువురు మహిళల బంగారు గొలుసులు అపహరణకు గురయ్యాయి. వచ్చే ఆదివారం నుంచి మహాజాతర కొనసాగనుంది. కొంతకాలం నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తుండటంతో ఆలయ పరిసరాలు జనంతో రద్దీగా మారుతున్నాయి. తమ కోరికలు ఈడేర్చినందుకు ప్రతిగా భక్తులు అధిక సంఖ్యలో గంగరేగుచెట్టు ప్రాంగణంలో నజరు పట్నాలు రచించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఇంటిల్లిపాది తరలివస్తుండటంతో జనసందోహం అధికంగా ఉంటుంది. పట్నాలు వేసే వారితో పాటు పవిత్రమైన గంగరేగుచెట్టుకు ముడుపులు కట్టి గండదీపానికి దండంపెట్టి ప్రదక్షిణలు చేస్తున్న క్రమంలో దొంగలు భక్తుల ఆభరణాలు, పర్సులు అపహరిస్తున్నారు. మొక్కులు తీర్చుకునేందుకు వస్తే ఉన్న నగలు, నగదు కోల్పోతుండటంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పలువురు దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందని ఫిర్యాదు చేయడానికి సైతం వెనకాడుతున్నారు. కాగా గతంలో గంగరేగుచెట్టు వద్ద చోరీలను నివారించేందుకు ప్రతీవారం మహిళా కానిస్టేబుళ్లను బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆగంతకులను కనిపెట్టడానికి వీలుగా కానిస్టేబుల్ పరిశీలన కోసం వ్యూ స్టాండ్ ఏర్పాటు చేయించారు. గతేడాది దొంగల ముఠాను పట్టుకోవడంతో కాస్త తగ్గుముఖం పట్టినా ప్రస్తుత బ్రహ్మోత్సవాల సమయంలో పలు ఘటనలకు పాల్పడి ఆగంతకులు అలజడి చేసి ఉనికిని చాటారు. ఈ నేపథ్యంలో వచ్చే ఆదివారం నుంచి 12 వారాల పాటు జాతర కొనసాగనున్నందున దొంగతనాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.




ఆలయ ఆవరణలోని గంగరేగుచెట్టు ప్రాంగణంలో జనసందోహం, చోరీకి గురవడంతో విలపిస్తున్న భక్తులు (ఫైల్)

పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తాం

గంగిరేగుచెట్టు ప్రాంగణంలో పటిష్ట నిఘా పెడతాం. మఫ్టీ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేస్తాం. దొంగతనాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. రాజగోపుర ఆవరణలో పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. చుట్టుపక్కలవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అనుమానం కలిగినా తమకు తెలపాలని భక్తులకు సూచనలు చేస్తాం.

- సత్యనారాయణరెడ్డి, చేర్యాల సీఐ

జీవవైవిధ్య స్ఫూర్తి డీడీఎస్‌కే సొంతం

- పంటలను, భూములను కాపాడుకుందాం
- డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణీరావు

జహీరాబాద్, జనవరి 14 : జహీరాబాద్ ప్రాంతంలో జీవవైవిధ్య స్ఫూర్తిని పెంపొందించడం డీడీఎస్(డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ)కే సాధ్యమైందని డైరెక్టర్ రుక్మిణీరావు అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని జాడీ మల్కాపూర్ గ్రామంలో డీడీఎస్ ఆధ్వర్యంలో పాతపంటల జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన పంటల్ని, వ్యవసాయ భూముల్ని మనమే కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డీడీఎస్ అభివృద్ధిలో మహిళా రైతుల కృషి అమోఘం అని కొనియాడారు. డీడీఎస్ చేస్తున్న కృషికి ప్రభుత్వం తోడ్పాటును అందించాలని ఆమె కోరారు. డీడీఎస్ సంస్థ 40 ఏళ్లుగా చేస్తున్న కృషికి దేశవిదేశాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు ఆదరించారని గుర్తుచేశారు. ప్రభుత్వంతో పాటు, రైతులు సహకరించాలని చిరుధాన్యాల సాగును మరింత పెంచుదామన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో పాతపంటల జాతరను 24 ఏళ్లుగా నిర్వహిస్తూ చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. డీడీఎస్ అభివృద్ధికి చిరుధాన్యాల సూరీడు స్వర్గీయ సతీష్ ఎనలేని కృషి చేశారని, నిరుపేద మహిళలను ఆదుకుని వారికి అండగా నిలిచారని ఆమె గుర్తుచేశారు. అనంతరం హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌లు వినోద్‌పావురాల, అపర్ణరాయప్రోలు, యునెస్కో కమ్యూనిటీ మీడియా చైర్మెన్ కంచన్‌మాలిక్, హైదరాబాద్ యూనివర్సిటీ కమ్యూనికేషన్ డీన్ వాసుకి బెలవాడి తదితరులు మాట్లాడుతూ ఒకప్పుడు చిరుధాన్యాలంటే నవ్వుకునేవారని, వాటికి నేడు డిమాండ్ పెరగడం సంతోషకరమన్నారు. తాము ప్రతీరోజు ఆహారంలో చిరుధాన్యాలను తీసుకుంటున్నామన్నారు. డీడీఎస్ మహిళా రైతులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మహిళా రైతులు సుమిత్రబాయి, కమిలిబాయి, ఎల్గొయి నర్సమ్మ, పొట్టిపల్లి సుకన్య తదితరులను అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సలోమి, డీడీఎస్ డిప్యూటీ డైరెక్టర్ గిరిధర్, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ శిరీషభరత్‌రెడ్డి, డీడీఎస్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎడ్లబండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు.


జీవవైవిధ్య సంరక్షకులను సన్మానిస్తున్న ప్రొఫెసర్ వినోద్

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ రాధిక - కాప్రా
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
గలేరియా - పంజాగుట్ట	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరజ్ సినిమాస్ - చందానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
అట్రియమ్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఎస్2 నోము - మల్లాపూర్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	మూవీటైమ్ - అమీర్‌పేట
ఎం.పి మాల్ - కాచిగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
జిఎస్ఎమ్ - మదీనగూడ	టివోలి - సికింద్రాబాద్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	షా షహెన్‌షా - చింతల్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
మంత్రామాల్ - అత్తాపూర్	మూవీమ్యాక్స్ - మౌలాలి
సుధా - శాలిబండ	జె.పి.సినిమాస్ - చందానగర్

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ రాధిక - కాప్రా
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
గలేరియా - పంజాగుట్ట	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరజ్ సినిమాస్ - చందానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
అట్రియమ్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఎస్2 నోము - మల్లాపూర్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	మూవీటైమ్ - అమీర్‌పేట
ఎం.పి మాల్ - కాచిగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
జిఎస్ఎమ్ - మదీనగూడ	టివోలి - సికింద్రాబాద్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	షా షహెన్‌షా - చింతల్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
మంత్రామాల్ - అత్తాపూర్	మూవీమ్యాక్స్ - మౌలాలి
సుధా - శాలిబండ	జె.పి.సినిమాస్ - చందానగర్

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఒగ్గుపూజారి డబ్బు డిమాండ్‌పై భక్తుడి ఆగ్రహం

చేర్యాల, జనవరి 14 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలోని గంగిరేగుచెట్టు ప్రాంగణంలో ఆదివారం పట్నం వేసిన ఒగ్గుపూజారి డబ్బు డిమాండ్ చేయడంతో భక్తుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన భక్తుడు కట్ల జనార్దన్‌రెడ్డి నుంచి ఒగ్గుపూజారి జింకల బుచ్చయ్య రూ.500 డబ్బు డిమాండ్ చేశాడు. కట్నంపేరిట అడిగినంత ఇవ్వకుంటే పట్నం చెల్లించనని ఒగ్గుపూజారి బుచ్చయ్య నిరాకరిస్తూ పట్నంవస్త్రాన్ని చెత్తబుట్టలో వేయడంతో భక్తుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అనంతరం ఆలయాధికారులకు తెలిపాడు. ఇదిలా ఉండగా శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో భక్తుల నుంచి డబ్బులు డిమాండ్ చేయకూడదని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు పునరుద్ధరణ కమిటీ సభ్యులు సూచించినా మరుసటిరోజున ఒగ్గుపూజారులు భక్తుల నుంచి డబ్బుల పేరిట ఇబ్బందులకు గురిచేయడం గమనార్హం.

క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి



యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

మద్దూరు, జనవరి 14 : యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని దూళిమిట్ట మండలం బెక్కల్ సర్పంచ్ కూకట్ల బాలరాజ్ సూచించారు. సంక్రాంతి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బెక్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యవతకు క్రికెట్, వాలీబాల్ కిట్స్ పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామ యువకులు ప్రతీ పండగ ఉత్సవాల సందర్భంగా నిర్వహించే క్రీడోత్సవాల్లో పాల్గొని మంచి ప్రతిభను కనపర్చాలని సూచించారు. క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకుని శారీరక మానసికోల్లాసాన్ని ఆస్వాదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చొప్పరి బాలయ్య, వార్డుసభ్యులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు దిలీప్, నర్సింహులు, ప్రదీప్, బిట్టు, తిరుపతి, సాయి, నర్సింహా, సోషల్ మీడియా కన్వీనర్ చొప్పరి రాజు పాల్గొన్నారు.

రామునిపట్లలో క్రికెట్ పోటీలు



రామునిపట్లలో క్రికెట్ ఆడుతూ యువకులను ఉత్సాహపరుస్తున్న ఎంపీపీ

చిన్నకోడూరు, జనవరి 14 : యువత చదువుతో పాటు, క్రీడల్లో రాణించాలని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రామునిపట్ల గ్రామంలో జేరిపోతుల రంగయ్య స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ఆయన సర్పంచ్ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక ధృడత్వానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో స్పాన్సర్ జేరిపోతుల లక్ష్మణ్, ఉప సర్పంచ్ కుమార్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

మహిళలను ప్రోత్సహించడం అభినందనీయం



ముగ్గుల పోటీల విజేతకు బహుమతిని అందజేస్తున్న ఎస్ఐ శ్రీధర్

హుస్నాబాద్ రూరల్, జనవరి 14: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను ప్రోత్సహించి వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించడం పట్ల నిర్వాహకులను హుస్నాబాద్ ఎస్ఐ టి. మహేష్ అభినందించారు. ఆదివారం మండలంలోని పందిల్ల గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామ పంచాయతీ, మహిళా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేష్ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొడేటి రమేష్, ఎంపీటీసీ జయలక్ష్మి, ఉపసర్పంచ్ నెల్లి శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి శారద, పద్మ, శంకర్‌రెడ్డి, రాజేశ్వరి, మమత, సంధ్య గురువారెడ్డి పాల్గొన్నారు.

చౌడారంలో..



ముగ్గుల పోటీలో విజేతకు బహుమతిని అందజేస్తున్న సర్పంచ్

చిన్నకోడూరు, జనవరి 14 : ముగ్గులు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని సర్పంచ్ పెండ్యాల అనిత పేర్కొన్నారు. మండలంలోని చౌడారంలో సంక్రాంతి పండగ సందర్భంగా శ్రీగణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో గెలిచినవారిని స్ఫూర్తిగా తీసుకుని పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బాలయ్య, యూత్ సభ్యులు రాజు, విక్రమ్, బాపురెడ్డి, చంద్రారెడ్డి, రవి, గ్రామ యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కడవేరుగు సబ్‌స్టేషన్ పనులు త్వరగా పూర్తిచేయాలి

చేర్యాల, జనవరి 14 : చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో చేపట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పనులను త్వరగా పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం చేర్యాల మండల కార్యదర్శి కత్తుల భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన సబ్‌స్టేషన్ పనులు పరిశీలించిన అనంతరం మాట్లాడారు. నిర్మాణం పనుల్లో కాంట్రాక్టర్ జాప్యం వహిస్తున్నా, నాసికరం మెటీరియల్ వినియోగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు.

ప్రతిఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

దుబ్బాక, జనవరి 14: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగిఉండాలని డీపీవో(డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజర్) డానియల్ అన్నారు. ఆదివారం దుబ్బాక లోని కూరగాయల మార్కెట్‌లో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీవారి సహకారంతో జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు భుజంగం, మురళీ, ఓంకారం, కృష్ణమౌళి, లక్ష్మీకాంతి తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

శరవేగంగా ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ

- సంగారెడ్డి జిల్లాలో మొత్తం దరఖాస్తులు 3,83,979
- 80 శాతం కంప్యూటరీకరణ పూర్తి
- సెలవు దినాల్లో సైతం కొనసాగుతున్న ప్రక్రియ

సంగారెడ్డి టౌన్, జనవరి 14: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఆరు గ్యారంటీల పథకాల లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ శరవేగంగా జరుగుతున్నది. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం కాంగ్రెస్ సర్కారు చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల కంప్యూటరీకరణ సంగారెడ్డి జిల్లాలో 80శాతం పూర్తయినట్టు అధికార వర్గాలు తెలిపాయి. డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీవరకు జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన నిర్వహించిన విషయం తెలిసిందే. వారంరోజుల పాటు జరిగిన ప్రజాపాలన కార్యక్రమాల్లో సంగారెడ్డి జిల్లాలో మొత్తం 3,83,979 దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ నిరంతరాయంగా కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు 80శాతం పూర్తయిన ప్రజాపాలన దరఖాస్తుల 'ఆన్‌లైన్' నమోదు ప్రక్రియ మరో రెండు, మూడురోజుల్లో వందశాతం పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పండగ రోజులు, సెలవుదినాల్లో సైతం దరఖాస్తుల కంప్యూటరీకరణ నిర్విఘ్నంగా కొనసాగుతున్నది.

3,83,979 దరఖాస్తులు

గత నెల 28 నుంచి ఈ నెల 6వ తేదీవరకు నిర్వహించిన ప్రజాపాలనలో మొత్తం 3,83,979 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 25 మండలాల పరిధిలో 647 గ్రామపంచాయితీలల్లో 2,91,782 దరఖాస్తులు రాగా 8 మున్సిపాటిటీల పరిధిలో 199 వార్డుల నుంచి 92,197 దరఖాస్తులు వచ్చాయి. అమీన్‌పూర్, మున్సిపాలిటీలో 13,324 దరఖాస్తులు, అందోల్‌లో 4703, బొల్లారంలో 8515, నారాయణఖేడ్‌లో 4343, సదాశివపేటలో 11157, సంగారెడ్డిలో 19,361, తెల్లాపూర్‌లో 8184, జహీరాబాద్‌లో 22610 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు వివరించారు.

ఆరుగ్యారంటీల 3,24,253 దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాల కోసం భారీ సంఖ్యలో ఆర్జీలు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 3,83,979 ఆర్జీలు రాగా.. ఆరుగ్యారంటీల కోసం 3,24,253 దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన 59,725 అర్జీలు రేషన్‌కార్డులు, ధరణి సమస్యలపై వచ్చాయి. ఆరు గ్యారంటీలైన రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు మహాలక్ష్మి ద్వారా రూ.2500, రైతు భరోసా, ఇళ్లస్థలాల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి.

80శాతం కంప్యూటరీకరణ పూర్తి

ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను శరవేగంగా కంప్యూటీకరిస్తున్నారు. ఇందుకోసం కంప్యూటర్ డాటా ఎంట్రీ ఆపరేటర్లకు బాధ్యతలు అప్పగించారు. మున్సిపాలిటీల్లో వార్డుకు ఒక ఆపరేటర్‌ను, గ్రామాల్లో ఇద్దరు ఆపరేటర్ల చొప్పున నియమించారు. ఈనె 7వ తేదీ నుంచి మొదలైన కంప్యూటీకరణ ఇప్పటివరకు 80శాతం పూర్తయింది. కంప్యూటీకరణ చేసిన ఒక్కో దరఖాస్తుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రభుత్వం రూ.15 చొప్పున ఇవ్వనున్నది. ఇందులో ప్రైవేటు ఆపరేటర్లకు రూ.10 చొప్పున ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో దరఖాస్తుకు రూ.5 చొప్పున ఇవ్వనున్నట్టు తెలిసింది. సెలవు దినాల్లో సైతం ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటర్‌లల్లో నమోదు చేస్తున్నారు.



ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్లు

ఆదర్శ పాఠశాలలో దరఖాస్తుల స్వీకరణ

● తుది గడువు ఫిబ్రవరి 22 ● ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష



ఇర్కోడ్ మోడల్ స్కూల్ భవనం

సిద్దిపేటరూరల్, జనవరి 14: నాణ్యమైన ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తున్న తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశ పరీక్ష రాసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడ్, దుబ్బాక మండలంలోని లచ్చపేట, మిరుదొడ్డి, చిన్నకోడూర్ మండలంలోని ఇబ్రహీంనగర్, నంగునూరు మండలంలోని అక్కెనపల్లిలో, కొండపాక, గజ్వేల్‌లోని ఎడ్యుకేషన్ హబ్‌లో (బాలికలకు మాత్రమే), చేర్యాల మండలంలో ముస్త్యాలలో, మద్దూర్, బెజ్జంకి, హుస్నాబాద్, కోహెడ మండలంలో నాగసముద్రాలలో, దౌల్తాబాద్ మండలాల్లో మొత్తం 14 మోడల్ స్కూల్స్ కొనసాగుతున్నాయి. ఇందులో ఆరవ తరగతిలో మాత్రమే అడ్మిషన్ తీసుకుంటారు. ఆరవ తరగతిలో 100 సీట్లు ఉంటాయి. 7, 8, 9, 10 తరగతులల్లో ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవాలి. 6వ తరగతిలో చేరాలనుకునే విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ఖాళీలను భర్తీ చేస్తారు. ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నది. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7,8,9,10 తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. వంద మార్కుల ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఉంటుంది. గణితం, తెలుగు, ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఇంగ్లీష్ పాఠ్యాంశాలల్లోంచి ఒక్కొక్క దాంట్లోంచి 25 ప్రశ్నలుంటాయి. 7 నుంచి 10వ తరగతులకు గణితం, సామాన్య, సాంఘికశాస్త్రం, ఇంగ్లీష్ సబ్జెక్టులోంచి 25 ప్రశ్నలతో వంద ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే ఈ పరీక్షను రెండు గంటలలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

నాణ్యమైన ఉచిత విద్య, సౌకర్యాలు



ఆదర్శ పాఠశాలలో ఉచిత విద్యతో పాటు క్రమశిక్షణ, క్రీడల్లో, సంస్కృతీ సంప్రదాయాలు నేర్పిస్తారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు మోడల్ స్కూళ్లు కేంద్రాలుగా మారాయి. విద్యార్థులు మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ పొందాలంటే తప్పనిసరిగా ప్రవేశ పరీక్ష రాయాల్సిందే. మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. గతేడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన అనేకమంది విద్యార్థులు బాసర ట్రిబుల్ ఐటీలో అడ్మిషన్ పొందారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులు.

- బుచ్చిబాబు, ప్రిన్సిపాల్, ఇర్కోడ్ మోడల్ స్కూల్

ముగిసిన సిద్దివినాయక జయంత్యుత్సవాలు

● స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే హరీశ్‌రావు



రేజింతల్ గ్రామంలోని సిద్దివినాయక ఆలయంలో పూజలు చేస్తున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

న్యాల్‌కల్, జనవరి 14: మండల పరిధిలోని రేజింతల్ గ్రామశివారులో స్వయంభూగా వెలసిన సిద్దివినాయక ఆలయంలో మూడురోజులుగా నిర్వహించిన జయంత్యుత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపులో భాగంగా జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, ఎంపీ బీబీపాటిల్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యేలే చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ ఆలయంలో నిర్వహించిన యజ్ఞహోమంలో పాల్గొని సిద్దివినాయకుడిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ ట్రస్టు సభ్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎం.రవీందర్, మండల ఉపాధ్యక్షుడు మహ్మద్‌గౌస్, నాయకులు, కార్యకర్తలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి సన్నిధిలో హరీశ్‌రావు

సదాశివపేట, జనవరి 14: మకర సంక్రాంతి సందర్భంగా సదాశివపేట పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మాజీ మంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని స్వామి వారిని కోరుకున్నట్టు పేర్కొన్నారు. ఆయనవెంట జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, నాయకులు ఉన్నారు.

అట్టహాసంగా జిల్లాస్థాయి క్రీడలు ప్రారంభం



కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, స్థానిక నాయకులు

మద్దూరు, జనవరి 14: దూళిమిట్ట మండల కేంద్రంలో దూళిమిట్ట స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా క్రీడాకారులను స్థానిక నాయకులు రచ్చ లక్ష్మయ్య, చెట్కూరి కమలాకర్, నాచగోని వెంకట్, సుందరగిరి భాస్కర్, తాడెం శ్రీనివాస్, నారోజు శ్రీనివాస్, తిగుళ్ల తిమ్మార్తి, ఉపసర్పంచ్ లింగంతో కలిసి జడ్పీటీసీ పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీడలను జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. 31 కబడ్డీ, 20 వాలీబాల్ టీంలు పాల్గొన్నట్లు నిర్వాహకులు గోపి, అనిల్, సతీష్, లింగం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచగోని లక్ష్మణ్, బావండ్లపల్లి కృష్ణయ్య, కోల సత్తయ్య, సుద్దాల నర్సింహులుతో పాటు వాలంటీర్లు, గ్రామస్థులు, పీఈటీలు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కబడ్డీ ఫైనల్స్ విజేతలు నల్గొండ, రంగారెడ్డి

● హోరాహోరీగా సాగిన ఫైనల్స్



కబడ్డీ ఫైనల్లో గెలుపొందిన బాలికల జట్టుతో ప్రతాప్‌రెడ్డి, రాజమౌళి

గజ్వేల్, జనవరి 14: గజ్వేల్ పట్టణంలో నాలుగురోజుల పాటు సాగిన 49వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఫైనల్స్‌లో బాలికల విభాగంలో నల్గొండ-రంగారెడ్డి జిల్లా జట్లు పోటీపడగా, నల్గొండ జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో నల్గొండ-రంగారెడ్డి జట్లు తలపడగా రంగారెడ్డి జిల్లా జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయాన్ని సొంతం చేసుకున్నది. వారికి తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, టీఎస్‌టీడీసీ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాల చేతులమీదుగా బహుమతులను అందజేశారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఆప్కో మాజీ డైరెక్టర్ తలకొక్కుల రాజు, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్‌గుప్తా, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దండుగుల రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు సీర్ల శ్యామల మల్లేశం, ఉప్పల మెట్టయ్యగుప్తా, రహీం, దుర్గాప్రసాద్, నవాజ్ మీరా, శివకుమార్, నాగిరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్, ఉపాధ్యక్షుడు సంపంగి రాజు, ప్రేమ్‌కుమార్, రంగనాథ్, కోశాధికారి కుంట సత్యం పాల్గొన్నారు.

సాధనతో ఏదైనా సాధ్యమే

- సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం
- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు
- విజేతలుగా నిలిచిన మెదక్, నిజామాబాద్ జట్లు



సాఫ్ట్‌బాల్ పోటీల్లో గెలుపొందిన మెదక్ బాలుర జట్టు

కొండపాక, జనవరి 14: అనునిత్యం సాధన చేస్తే సాధించలేనిది ఏదీ ఉండదని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం అన్నారు. కొండపాక వేద ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములు సమానంగా తీసుకొని ఓడిపోయిన వారు బాధపడకుండా అనునిత్యం ప్రాక్టీస్ చేయాలని సూచించారు. విద్యాబుద్ధులు నేర్పే గురువులను ఎప్పటికీ మరువకూడదన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సమ్మయ్య మాట్లాడుతూ క్రీడా పోటీలు హోరాహోరీగా జరిగాయని ప్రతి క్రీడాకారుడు తమ వంతు ప్రతిభ కనబరిచాడన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలుర విభాగం నుంచి 16 మందిని, బాలికల విభాగం నుంచి 16 మందిని జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. జాతీయస్థాయి పోటీలు మహారాష్ట్ర ఔరంగాబాద్‌లో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు పరిశీలకులుగా వ్యవహరించిన నీరజ, బిక్కు నాయక్ మాట్లాడుతూ క్రీడాకారులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను చక్కగా చేశారన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులు మరింత సాధనచేసి జాతీయస్థాయిలో గెలుపొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. బాలుర విభాగంలో మెదక్ జిల్లా జట్టు, బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా జట్టు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కొండపాక జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అమరేందర్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దిపేట అధ్యక్షుడు తోట సతీష్, వ్యాయామ ఉపాధ్యాయులు వివిధ సంఘ ప్రతినిధులు శ్రీనివాస్, పాషా, గంగ మోహన్, వెంకటేష్, సమ్మయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

గతంలో ఇచ్చిన పట్టా భూమిలోకి రానివ్వడం లేదు

● నాగ్సన్‌పల్లి గ్రామ రైతుల ఆవేదన





ధరణిలో రైతుల పేరున వచ్చిన కొత్త పట్టా పాసుపుస్తకాలు, గ్రామస్థులకు అందజేసిన పట్టా సర్టిఫికెట్, పాసుపుస్తకాలు చూపిస్తున్న రైతులు

కొడిపల్లి, జనవరి 14: అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ చేతులమీదుగా అందుకున్న పట్టా సర్టిఫికెట్లు ఉన్న భూములోకి తమను అధికారులు రానివ్వడం లేదని మండల పరిధిలోని నాగ్సన్‌పల్లి గ్రామ రైతులు తెలిపారు. ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2005లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చేతులమీదుగా గ్రామానికి చెందిన సుమారు 25 మంది పేద రైతులకు 30 ఎకరాల వరకు సర్వేనెంబర్ 93లో పట్టా సర్టిఫికెట్లను మెదక్‌లో అందించారు. అప్పటి నుంచి రైతులు తమకు పట్టా సర్టిఫికెట్ల భూమి సర్వే చేసి చేసి చూపించాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. వారంరోజుల క్రితం ఇదే సర్వే నెంబర్‌లో అటవీశాఖ, రెవెన్యూశాఖ అధికారులు జాయింట్ సర్వే చేసి ఈ భూమిని ఆనుకుని ఉన్న వందల ఎకరాల భూస్వామికి అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని రైతులు తెలిపారు. వందల ఎకరాల భూములు ఉన్నవారికి సహ కరించే అధికారులు రైతుల గురించి పట్టించుకోవడం లేదని వాపోయారు. తమకు ఇచ్చిన భూమికి రైతు బంధుతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రుణాలు వస్తున్నాయని అన్నారు. అధికారులు స్పందించి తమకు ఇచ్చిన సర్టిఫికెట్‌లో భూమిని చూపించి ఆదుకోవాలని కోరారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో అల్లాయిపేట అంజయ్య, లక్ష్మి, భూమయ్య, నాగమ్మ, శ్రీనువాస్ రైతులు ఉన్నారు.

హుస్నాబాద్‌లో పండుగ పూట విషాదం

● కారుబోల్తా.. బాలుడి మృతి ● మరో ముగ్గురికి గాయాలు







మృతిచెందిన యశ్వంత్, ఎగ్గోజు యశ్వంత్(ఫైల్), ప్రమాదానికి గురైన కారు

హుస్నాబాద్, జనవరి 14: పండుగ పూట హుస్నాబాద్ పట్టణంలో విషాదం నెలకొన్నది. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన బాలుడు ఎగ్గోజు యశ్వంత్(17) మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ తోట మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం బురుజు వద్ద కాలనీలోని ఎగ్గోజు అంజనేయులు, హేమలతల కుమారుడైన యశ్వంత్ హన్మకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పండుగ సెలవులకు ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం తన స్నేహితులైన పట్టణానికి చెందిన కే.అజయ్, ఎన్.వెంకటేశ్, ఏ.అఖిల్‌లతో కలిసి కారులో పొట్లపల్లి రాజేశ్వరస్వామి ఆలయానికి వెళ్లాడు. అక్కడి నుంచి చిగురుమామిడి మండలం సుందరగిరిలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని హుస్నాబాద్‌కు వస్తుండగా పట్టణ శివారులోని ఇండేన్ గ్యాస్ సమీపంలో ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేశారు. బస్సు ముందు ద్విచక్రవాహనం ఉండటంతో దానిని తప్పించబోగా కారు అదుపు తప్పి బోల్తాపడి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో యశ్వంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, అయితే కారులో ఉన్న వారందరూ మైనర్లేనని ఎస్‌ఐ తెలిపారు.

లారీ బోల్తా, డ్రైవర్ మృతి



మహ్మద్ అజీజ్(ఫైల్)

హవేళిఘణపూర్, జనవరి 14: లారీ బోల్తా పడి డ్రైవర్ ఆదివారం మృతిచెందాడు. మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్‌కు చెందిన మహ్మద్ అజీజ్ లారీ నడుపుతూ జీవిస్తున్నాడు. శనివారం లారీ రేకుల లోడ్‌తో తూప్రాన్ నుంచి నాందేడ్ బయలుదేరింది. శనివారం రాత్రి మండలంలోని ఔరంగాబాద్ శివారులోని లెప్రసీ హాస్పిటల్ మూలమలుపు వద్ద వేగంగా వచ్చిన లారీ బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. క్లీనర్ రఫీక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి సోదరుడు మహ్మద్ హనీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొండపాక, జనవరి 14: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. సిద్దిపేట గాంధీనగర్‌కు చెందిన ఉప్పల వెంకటేశం మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. వెంకటేశం శనివారం ఇంటి నుంచి వెళ్లిపోగా కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం కొండపాక శివారులో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేశం మృతిచెందాడు. ఆధారాలు సేకరించిన పోలీసులు కుటుంబసభ్యులకు తెలిపారు. భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఐనాపూర్‌లో వ్యవసాయ మోటార్ల అపహరణ

చేర్యాల, జనవరి 14: కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలో శనివారం రాత్రి గుర్తుతెలియని ఆగంతకులు పలువురి వ్యవసాయబావుల వద్ద బోరు మోటార్లను అపహరించుకుపోయారు. గ్రామంలోని పెద్దచెరువు ఆయకట్టు ద్వారా సాగుచేసుకుంటున్న రైతులు దండు కృష్ణారావు, చాకలి భూమయ్య, దండు బాలయ్య, దండు మల్లయ్య బావుల వద్ద గల 5హెచ్‌పీ బోరుమోటార్లు, పంప్‌సెట్లను దొంగిలించుకుపోయారు. ఈ విషయమై రైతులు ఆదివారం కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధం



దగ్ధమైన ఇంటి వద్ద బాధితులు

నిజాంపేట, జనవరి 14: విద్యుదాఘాతంతో పూరిగుడిసె ఆదివారం దగ్ధమైంది. నిజాంపేట మండల పరిధిలోని వెంకటాపూర్ కే గ్రామానికి చెందిన గోపరి తులసమ్మ, నర్సింహులుకు చెందిన పూరి గుడిసె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో వంట సామగ్రి, బియ్యం, దుస్తులు, దాదాపు రూ.50 వేల నగదు పూర్తిగా కాలిబూడిదైంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ లక్ష్మీసిద్ధిరాములు, బీఆర్ఎస్ నాయకులు దయాకర్ తదితరులు ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్మీలో దిగ్విజయంగా విధులు పూర్తి చేసుకున్న రైతుబిడ్డ

● మామ స్ఫూర్తితో ఆర్మీలో సేవలు చేస్తున్న అల్లుళ్లు ● నేడు ఆర్మీ దినోత్సవం







నీల చంద్రం, ఆంజనేయులు, నందీశ్వర్

రాయపోల్/గజ్వేల్, జనవరి 14: సాధారణంగా ఆర్మీలోకి పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు వెనుకంజ వేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనైతే అసలే ఒప్పుకోరు. అలాంటిది ఓ మారుమూల పల్లెటూరులోని సామాన్య వ్యవసాయ కుటుంబం నుంచి ఆర్మీలో చేరి దిగ్విజయంగా సుమారు 20 ఏళ్ల పాటు విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేయనున్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని మారుమూల అనాజీపూర్ గ్రామానికి చెందిన నీల చంద్రం 19 ఏళ్ల క్రితం ఆర్మీలో చేరి దేశ రక్షణలో భాగస్వామ్యుడయ్యారు. మొదట్లో జమ్మూ కాశ్మీర్‌లోని లడక్‌లో విధులు నిర్వహించారు. అనంతరం 2008లో అత్యంత క్లిష్టమైన రాష్ట్రీయ రైఫిల్స్‌లో ఎంపికై రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో పని చేశారు. ఆ సమయంలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పలు ఆపరేషన్‌లో పాల్గొన్న సమయంలో తోటి జవాన్లు అమరులైనా పట్టుదలతో విధులు నిర్వహించారు. ఆర్మీలో 20ఏళ్ల పాటు దిగ్విజయంగా సేవలు చేసిన ఆయన ఫిబ్రవరి 29న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

మామ బాటలోనే అల్లుళ్లు

మేనమామను స్ఫూర్తిగా తీసుకున్న మంతూరు గ్రామానికి చెందిన చంద్రం సోదరి కొడుకులు ఆంజనేయులు, నందీశ్వర్‌లు తాము కూడా ఆర్మీలో చేరి దేశ సేవ చేయాలని నిర్ణయించుకున్నారు. తల్లిదండ్రులు పడిగె నర్సింహులు, జనమ్మలకు ఈ విషయం చెప్పగా ఆ దంపతులు అడ్డు చెప్పలేదు. మేనమామ ప్రోత్సాహంతో ఆజాద్ డిఫెన్స్ అకాడమీ గజ్వేల్‌లో కోచింగ్ తీసుకున్నారు. సోదరులిద్దరూ 2018లో ఆర్మీకి సెలక్టయ్యారు. ఆంజనేయులు ప్రస్తుతం జమ్మూర్ రాజౌరీ సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. నందీశ్వర్ సిక్కింలో చైనా బార్డర్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లి, తిమ్మక్కపల్లి, మంతూరు గ్రామాల నుంచి ఒక్కొక్కరు ఆర్మీలో చేరారు. ఇదిలా ఉండగా దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామం నుంచి 8మంది ఆర్మీలో చేరి దేశ సేవ చేస్తున్నారు.

నేటి నుంచి స్వయంభూ శ్రీరామలింగేశ్వరస్వామి జాతర



శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం

తూప్రాన్, జనవరి 14: తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులోని రామప్ప గుట్టపై వెలసిన స్వయంభూ శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి జాతరను సంక్రాంతి పర్వదినం సందర్భంగా మూడురోజులు నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గొల్లపల్లి సురేందర్‌రెడ్డి, సర్పంచ్ జంగం సుకన్యారమేష్, ఆలయ పూజారి శలాక ఆత్రేయశర్మ ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్రాంతి రోజున జాతర ప్రారంభంకానున్నది. అదేరోజు బండ్లు, బోనాలు, సాయంత్రం జాతర నిర్వహించనున్నారు. 16న గోపాలకాలువలు, స్వామి సేవ ఊరేగింపు, 17న బుధవారం హోమం, రథోత్సవం నిర్వహించనున్నారు.

కనులపండువగా గోదారంగనాయకుల కల్యాణం



హుస్నాబాద్ మండలం పొట్లపల్లి రామాలయంలో గోదాదేవి-రంగనాయకుల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

ధనుర్మాసాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా వైష్ణవాలయాల్లో గోదా రంగనాయకుల కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపులు, ప్రత్యేక పూజలతో ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది.

హుస్నాబాద్‌రూరల్, జనవరి 14: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని బుధవారం గోదాదేవి-రంగనాయకుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం 11 గంటలకు స్వయంభూ రాజేశ్వర స్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకు వచ్చి రామాలయంలో కల్యాణోత్సవం జరిపించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు పరాంకుశం వెంకటరామక్రిష్ణ,. దీపక్‌మిత్రా, ధర్మకర్తలు రాందత్తారెడ్డి, జితేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల, కానుగుల మోహన్, పొన్నాల రజనీ అర్జున్‌రెడ్డి, స్వాతి ఎల్లారెడ్డి కల్యాణం జరిపించారు. శివరామ కృష్ణ భక్తజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



చేర్యాలలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గోదారంగనాయకుల కల్యాణ వేడుకలు



గజ్వేల్ రామాలయంలో గోదారంగనాయక స్వామి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

● **గజ్వేల్ రూరల్:** గజ్వేల్ పట్టణంలోని శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో ధనుర్మాసోత్సవ చివరి రోజు భోగి సందర్భంగా ఆదివారం ఆలయ నిర్వాహకులు విశేషపూజలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో కొలువుదీరిన మూల విగ్రహానికి ప్రత్యేకపూజలు చేసి పట్టు వస్త్రాలతో అందంగా అలకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో గోదారంగనాయకుల వారి కల్యాణ వేడుకలను జరిపించారు. గజ్వేల్‌లోని శ్రీగోదాపద్మావతి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వాహకులు, చైర్మన్ బుక్క రమేశ్, ప్రధాన అర్చకుడు శేషం శ్రీనివాసాచార్యులు ఆధర్యంలో గోదారంగనాయకుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయ నిర్వాహకులు నేతి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

● **కొండపాక:** కొండపాక మండలకేంద్రంలోని ఆనంద నిలయం ఆవరణలో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయక స్వామి వారి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవతమూర్తులైన గోదాదేవి రంగనాయక స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు మంగళ వాయిద్యాల మధ్య అర్చకులు సంప్రదాయ సిద్ధంగా కల్యాణోత్సవం చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆనంద నిలయం ట్రస్టు ప్రతినిధి బెజుగామ వెంకటేశం, విశ్వబ్రాహ్మణ అర్చక సంఘం అధ్యక్షుడు బాలబ్రహ్మం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.



కొండపాక ఆనందనిలయం ఆవరణలో కల్యాణోత్సవ తంతును నిర్వహిస్తున్న అర్చకుడు

● **చేర్యాల:** చేర్యాల పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం గోదారంగనాథుల కల్యాణాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

హుస్నాబాద్‌లో ప్రజలతో మమేకమైన పొన్నం



హోటల్‌లో టీ తాగుతూ ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి

హుస్నాబాద్, జనవరి 14: హుస్నాబాద్ పట్టణం మల్లెచెట్టు చౌరస్తాలో ఆదివారం రాత్రి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నారు. టీ హోటల్‌లో చాయ్ తాగుతూ కార్యకర్తలతో గడిపారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్ తదితరులు ఉన్నారు.

గజ్వేల్ నుంచి వేములవాడ ఆలయానికి పాదయాత్ర



ప్రవీణ్‌కు సీతారాముల ఫొటోను అందజేస్తున్న రామకోటి రామరాజు

గజ్వేల్ రూరల్, జనవరి13. ఈ నెల 22న జరిగే అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఆదివారం గజ్వేల్‌కు చెందిన వొల్ల ప్రవీణ్ అనే రామ భక్తుడు రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి వేములవాడ దేవస్థానానికి పాదయాత్రగా బయల్దేరారు. ఈ సందర్భంగా శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ప్రవీణ్‌కు ప్రత్యేక పూజలు చేసిన కాషాయ జెండా, సీతారాముల చిత్రపటం, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు శ్రీనివాసు, మఠం శివకుమార్, దేశపతి శంకరశర్మ, వెనవెళ్లి సతీష్, అయిల మహేందర్, వొల్లల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లిలోని సింగరాళ్ల మల్లన్న ఆలయం వద్ద ఎడ్లబండ్ల ఊరేగింపు, జాతరలో భక్తుల సందడి

ఘనంగా సింగరాళ్ల మల్లన్న జాతర



సింగరాళ్ల మల్లన్న ఆలయంలో పూజలు చేస్తున్న సర్పంచ్ చిలివేరి జ్యోతి దంపతులు



ఆలయంలో పూజలు నిర్వహించిన కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, జనవరి 14: తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం సింగరాళ్ల మల్లన్న ఆలయం వద్ద జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్‌లను అందంగా తీర్చిదిద్ది ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బోనాలు తీశారు. సింగరాళ్ల మల్లన్న ఆలయానికి కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, ఎంపిపి లతానరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, జిల్లా నాయకులు నిరంజన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, తిరుపతితో పాటు వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా గ్రామ సర్పంచ్ చిలివేరి జ్యోతిమల్లారెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు బండమల్లన్న జాతర

మిరుదొడ్డి, జనవరి 14: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి-జంగపల్లి గ్రామాల పరిధిలో శతాబ్దాల చరిత్ర కలిగిన బండమల్లన్న ఆలయం జాతరను సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. సుమారు 120 ఎకరాల విస్తీర్ణం కలిగి 160 మీటర్ల ఎత్తు కలిగిన బండపై సహజసిద్ధంగా వెలిసిన మల్లికార్జున స్వామిని పరిసరగ్రామాల ప్రజలు బండమల్లన్న స్వామిగా కొలుస్తూ, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విశ్వసిస్తారు. సహజసిద్ధంగా సొరికెలాంటి బండలో వెలిసిన కారణంగా బండ మల్లన్నగా పేరు ప్రఖ్యాతులు గాంచింది. అంతేగాకుండా విశాలమైన బండపై ఇతర ఆలయాల్లో కూడా దేవతామూర్తులు కొలువుదీరి ఉన్నాయి. విశాలమైన బండపై సహజసిద్ధంగా వెలిసిన పుట్టు గుండం ఇక్కడి విశేషంగా చెప్పుకుంటారు. దశాబ్దాలు గడుస్తున్నా, ఎన్ని కరువు కాటకాలు వచ్చినా పుట్టు గుండంలో నేటికీ నీరు పుష్కలంగా ఉండడం మల్లన్న దేవుడి మహిమగా చెప్పుకుంటారు. ఈ నీటిని రైతులు పంటలపై చల్లుకుంటారు. జనవరి ఫస్ట్ నుంచి సంక్రాంతి వరకు బండ చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు బండమల్లన్నకు బోనాలతో నైవేద్యాలను సమర్పించి అక్కడే భోజనాలను ఆరగిస్తారు. ఈ జాతరకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలతోపాటు పొరుగురాష్ట్రాల నుంచి విచ్చేస్తారు. బండచుట్టూ ఉన్న గ్రామాల భక్తులు ఎండ్లబండ్లను అందంగా అలంకరించి బండ్ల బోనాలతో మల్లన్న గుడి చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి మొక్కులను చెల్లించుకుంటారు. జాతర సందర్భంగా వీరారెడ్డిపల్లి సర్పంచు వెంకట్‌రెడ్డి, జంగపల్లి సర్పంచు యాదగిరి, ఆలయకమిటీ సభ్యుడు లింగాల వెంకట్‌రెడ్డి జాతరకు ఏర్పాట్లను చేశారు.





మిరుదొడ్డి: వీరారెడ్డిపల్లిలో సహజసిద్ధంగా వెలిసిన మల్లికార్జునస్వామి, బండపై వెలిసిన పుట్టుగుండం



చేర్యాల మండలం తాడూరు గ్రామంలో నిర్వహించిన ముగ్గులపోటీలో పాల్గొన్న మహిళలు, యువతులు

గ్రామాల్లో భోగి వేడుకలు



చేర్యాల: ఆకునూరులో ఇంటిముందు ముగ్గులు వేస్తున్న యువతులు

చేర్యాల, జనవరి 14: భోగి సంక్రాంతి పర్వదిన వేడుకలను ఆదివారం చేర్యాల, కొమురవెల్లి మండలాల ప్రజలు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా భోగిమంటలు జరిపారు. చిన్నారులకు బోడబొడాలు పోశారు. తమ ఇళ్ల ముంగిళ్లలో మహిళలు, యువతులు రంగులతో ముగ్గులువేశారు. మండలంలోని తాడూరు గ్రామంలో యూపీఎల్ అగ్రి సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా, యువతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు ప్రసాద్, సురేశ్, రవీందర్ బహుమతులను ప్రదానం చేశారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్ రూరల్, జనవరి 14: గజ్వేల్‌లో ఆదివారం భోగిని పురస్కరించుకొని మహిళలు తమ ఇళ్ల ముందు వివిధ రంగులతో ముగ్గులను తీర్చిదిద్దారు. చిన్న పిల్లలు, యువకులు ఒకరితో మరొకరు పోటీ పడుతూ గాలిపటాలను ఎగురవేశారు. సిద్దిపేట జిల్లా కబాడీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్ ఆధ్వర్యంలో యువకులు పెద్ద ఎత్తున స్థానిక ఐవోసీ మైదానికి చేరుకుని భోగి మంటలు వేసి ఆట పాటలతో సందడి చేశారు.

ఉమ్మడి మద్దూరు మండలంలో..

మద్దూరు, జనవరి 14 : భోగి పర్వదిన వేడుకల్ని ఉమ్మడి మద్దూరు మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం వాకిళ్ల ముందు మహిళలు వివిధ రంగుల్లో వేసిన విభిన్నరకాలైన ముగ్గులు చూపరులను అలరించాయి. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. భోగి, సంక్రాంతిని పురస్కరించుకుని ప్రజలు ఇళ్లల్లో పిండి వంటలను ఆరగించారు. వీధుల్లో హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి.

చిన్నకోడూరు మండలంలో..

చిన్నకోడూరు, జనవరి 14: భోగ భాగ్యాలనిచ్చే భోగి పండుగ వేడుకలను ఆదివారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే మహిళలు, యువతులు ఇంటి ముందు వాకిళ్లలో కల్లాపి చల్లి, భోగి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ రంగు రంగుల ముగ్గులు వేశారు. ముగ్గుల మధ్యలో ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. చిన్నారులు, యువకులు పతంగులు ఎగురవేస్తూ సంబురాలు జరుపుకున్నారు.

దళిత కళాకారులకు డప్పులు అందజేత



డప్పు కళాకారులకు డప్పులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు, మాజీ సొసైటీ డైరెక్టర్ జక్కిరెడ్డి

మద్దూరు, జనవరి 14: మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో భోగి సంక్రాంతి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ సొసైటీ డైరెక్టర్ జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి దళిత కళాకారులకు డప్పులు అందజేశారు. ఈ సందర్భంగా జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. గ్రామదేవతలకు నిర్వహించే పండుగల సందర్భంతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగంగా ఉండేందుకు డప్పులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మఠం భద్రయ్య, ఊట్ల శ్రీధర్‌రెడ్డి, కొమురవెల్లి దేవస్థానకమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు తాళ్లపల్లి వీరేందర్, రాజు, నరేష్, తిరుపతిరెడ్డి, ఆంజనేయులు, బాలయ్య, సురేష్, శ్రీకాంత్, అజయ్, రాజు ఉన్నారు.

మజీద్ కమిటీ దుబ్బాక అధ్యక్షుడిగా మౌలానోద్దిన్



మజీద్ కమిటీ నూతన కార్యవర్గం

మిరుదొడ్డి, జనవరి 14: దుబ్బాక నియోజకవర్గ మజీద్ కమిటీ అధ్యక్షుడిగా మౌలానోద్దిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో నియోజకవర్గ మజీద్ కమిటీ అధ్యక్షుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడిగా మౌలానోద్దిన్, ప్రధాన కార్యదర్శిగా అల్తాహుస్సేన్, గౌరవ అధ్యక్షుడిగా జాకీర్‌హుస్సేన్, ఉపాధ్యక్షులుగా యూసుఫ్, షకీల్ అహ్మద్, కోశాధికారిగా సోహెల్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాసులాబాద్‌లో ఉచిత వైద్య శిబిరం

మిరుదొడ్డి, జనవరి 14: మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో ఆదివారం సీఎస్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు ఉచిత వైద్యపరీక్షలను నిర్వహించి, మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు బాల్‌రాజు, గ్రామస్థులు తదితరులున్నారు.

ఏ రంగమైనా విజయానికి నిబద్ధత అవసరం

● శ్రీఅక్షయ కళాశాల వీడ్కోలు సమావేశంలో సినీ దర్శకుడు అనుదీప్

సంగారెడ్డి అర్బన్, జనవరి 14 : ఏ రంగమైనా విజయానికి నిబద్ధత అవసరమని సినీ దర్శకుడు కేవీ అనుదీప్ తెలిపారు. కొండాపూర్ మండలం మల్కాపూర్ సమీపంలోని శ్రీ అక్షయ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అనుదీప్ మాట్లాడుతూ.. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో పట్టువదలకుండా కృషి చేస్తే ఏదో ఒక రోజు విజయం సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీరప్ప, ప్రిన్సిపాల్ శ్రీశైలం, డైరెక్టర్లు సుధాకర్‌జోషి, రాజుగౌడ్, భానుచందర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పండుగపూట నీళ్లకు కటకట

● తపాస్‌పల్లి గ్రామపంచాయతీ ఎదుట ఖాళీబిందెలతో మహిళల నిరసన



గ్రామపంచాయతీ ఎదుట ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

చేర్యాల, జనవరి 14: పండుగపూట తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. మిషన్ భగీరథ పథకం ద్వారా పలు మండలాలకు తాగునీరు సరఫరా చేసేందుకు 2లక్షల లీటర్ల సామర్థ్యంతో తపాస్‌పల్లి గ్రామంలో జీఎల్‌బీఆర్ నిర్మించారు. గ్రామానికి పంపింగ్ ద్వారా సరఫరా చేస్తుండగా, 5, 6వ వార్డు పరిధిలోని మీది కాలనీవాసులకు కొద్దిరోజులుగా సక్రమంగా నీళ్లు అందడంలేదు. ఈ విషయమై మిషన్ భగీరథ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని, బోరు కాలిపోయినా మరమ్మత్తు చేయడం లేదని, మినీ ట్యాంక్‌లను నింపకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారని ఆరోపించారు.

పండుగ పూటకూడా నీటిసరఫరా చేయకపోవడంతో ఎలా అని ప్రశ్నించారు. ఈ విషయమై మిషన్ భగీరథ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జీఎల్‌బీఆర్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు.